సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



కామయ్య ఆశయ సాధనకు కృషి

మర్రి కామయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామని కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం విద్యార్థులు తెలిపారు. 8లో



మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు, తీర్థ యాత్రికుల కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. 8లో



అమ్మో...రంప ఆస్పత్రి 8లో

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు రోజు రోజుకు తీసుకట్టుగా మారాయి. రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు.

న్యూస్‌రీల్

వైద్యశాఖలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి

సాక్షి,పాడేరు: స్థానిక మెడికల్ కళాశాల, జిల్లా సర్వజన ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.పారామెడికల్, సపోర్టింగ్ స్టాఫ్ విభాగాల్లో 29 కేటగిరీలకు సంబంధించి 244 పోస్టులు భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. వీటిలో కాంట్రాక్ట్ పోస్టులు 107,అవుట్ సోర్సింగ్ పోస్టులు 137 ఉన్నాయన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి 2025 సంవత్సరం జనవరి 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. మెడికల్ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థులు దరఖాస్తులు అందజేయవచ్చు. మరిన్ని వివరాలకు www.gmcpaderu.com సంప్రదించాలని ఆమె కోరారు.

104 సేవలు మరింత విస్తృతం



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి జమాల్ బాషా

డుంబ్రిగుడ: జిల్లాలో 104 వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో కొర్ర పంచాయతీ బొర్రాపాలెంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులతో వైద్య సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 36 మందికి వైద్య సేవలందించారు. కించుమండల హెచ్‌వీ పద్మ, హెల్త్ అసిస్టెంట్ లవరాజు, సిబ్బంది జగదిష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలిగాలులు

- దట్టంగా పొగమంచు



పాడేరు-వడ్డాది రోడ్డులో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు/చింతపల్లి: జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. సాయంత్రం నుంచి వీటి ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఉపశమనం పొందేందుకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. రాత్రి సమయంలో చలితీవ్రత అధికంగా ఉంటోంది.ఉదయం 9గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తోంది. పొగమంచుతో సంతలు,వ్యవసాయ పనులకు వెళ్లే గిరిజనులతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే సోమవారం కనిష్ట ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. జి.మాడుగులలో 12.1 డిగ్రీలు, చింతపల్లి 13.2 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో హుకుంపేటలో 13.4డిగ్రీలు, పెదబయలులో 13.5, జీకే వీధిలో 13.6,అరుకువేలిలో 13.7, డుంబ్రిగుడలో 13.7, పాడేరులో 14.5, మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14, ముంచంగిపుట్టులో 15.1, కొయ్యూరులో 15.8, అనంతగిరిలో 16.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల 8లో



భౌగోళికంగా సంక్లిష్టంగా ఉన్న జిల్లాలో గంజాయి సాగుపై నిఘా ఏర్పాటు కష్టసాధ్యంగా మారింది. ఎన్నిసార్లు దాడులు చేసినా, మారుమూల ప్రాంతాల్లో మళ్లీ సాగు చేస్తున్నారు. కొండల నడుమ ఉండే అటువంటి ప్రాంతాలకు పోలీసులు వెళ్లలేని పరిస్థితి. దీంతో సాగు చేస్తున్న ప్రాంతాలను కనిపెట్టేందుకు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఇప్పటికే పలు మారుమూల ప్రాంతాలలో డ్రోన్లతో తనిఖీలు జరిపారు.

గంజాయి సాగుపై డ్రోన్ కన్ను

- డ్రోన్ల సాయంతో గంజాయి సాగు కట్టడికి చర్యలు
- ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన పోలీసులు
- సాగు గుట్టురట్టు చేస్తున్న నిఘా నేత్రాలు

మండలాలు	22
పోలీస్ స్టేషన్లు	30
వినియోగిస్తున్న డ్రోన్లు	4
సిబ్బంది	8 మంది
డ్రోన్ల సాయంతో గుర్తించిన సాగు ఎకరాలు	50

గంజాయి ప్రభావిత ప్రాంతాలు

జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, కొయ్యూరు, డుంబ్రిగుడ తదితర మండలాలు



డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలిస్తున్న సిబ్బంది



గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు



గంజాయి మొక్కలను దహనం చేస్తున్న పోలీసులు

పాడేరు : జిల్లా మూడో నేత్రం తెరుచుకుంది. డ్రోన్ల సాయంతో గంజాయి నిర్మూలన కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో తీసుకున్న పటిష్ట చర్యలతో ఐదేళ్ల పాటు జిల్లా వ్యాప్తంగా గంజాయి సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అప్పటి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు పలు ప్రత్యామ్నాయ పంటల సాగు సత్ఫలితాలు ఇచ్చాయి. ఆరు నెలల క్రితం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో పలుచోట్ల మళ్లీ గంజాయి సాగు ప్రారంభమైనట్టు సమాచారం. జిల్లా మీదుగా రవాణా అవుతున్న గంజాయి ఒడిశా ప్రాంతానికి చెందినదిగా చెబుతున్న పోలీసులు పలుచోట్ల గంజాయి సాగును చూసి విస్తుపోయారు. దీంతో డ్రోన్ల సాయంతో గంజాయి తోటల గుర్తింపునకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. తొలివిడతగా గంజాయి సాగు ప్రభావిత ప్రాంతాలైన జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, కొయ్యూరు, డుంబ్రిగుడ తదితర మండలాల్లోని మారుమూల గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నెల రోజుల క్రితం ఆయా ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో గంజాయి తోటలను గుర్తించారు. పోలీసులు ఫారెస్ట్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో సుమారు 50 ఎకరాల్లో గుర్తించిన గంజాయి తోటలను ధ్వంసం చేశారు. పలుచోట్ల పట్టా భూముల్లో గంజాయి సాగు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. పలువురిని అరెస్ట్ చేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడైన డ్రోన్ కెమెరాలు ఎగిరితే స్థానిక గిరిజనులు హడలిపోతున్నారు. ఈ ఆపరేషన్ సంక్రాంతి వరకు కొనసాగుతుందని సమాచారం.

జిల్లాలో నాలుగు డ్రోన్లు

జిల్లాలో నాలుగు డ్రోన్లతో గంజాయి సాగును గుర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఈ డ్రోన్లు ఉంటాయి. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఎక్కడ అవసరమైతే అక్కడికి పంపుతున్నారు. ఇటీవల వీటితో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి అదనంగా మూడు డ్రోన్లను రప్పించి తనిఖీలు చేశారు. జిల్లాలో నాలుగు డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు ఇద్దరు చొప్పున ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు. వీరికి ఇటీవల విజయవాడలో శిక్షణ ఇచ్చారు.

డ్రోన్ల సాయంతో గుర్తించిన గంజాయి తోటలు

- జి.మాడుగుల మండలం మారుమూల సొలభం పంచాయతీ డేగలరాయి గ్రామ పరిసర ప్రాంతాల్లో 5 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి తోటలను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సాగులో ప్రమేయమున్న 18 మందిని చేసి అరెస్టు చేశారు.
- పెదబయలు మండలం వనభంగి పంచాయతీ జడిగూడలో అటవీ భూముల్లో సాగవుతున్న 10 ఎకరాల గంజాయి తోటలను గుర్తించి, ధ్వంసం చేశారు.
- కొయ్యూరు మండలం అన్నవరం గ్రామ పరిసరాల్లో 15 ఎకరాల గంజాయి తోటలను గుర్తించారు. స్థానిక గిరిజనులకు అవగాహన కల్పించి వారితోనే స్వచ్ఛందంగా తోటలను ధ్వంసం చేయించారు.
- ముంచంగిపుట్టు మండలం వనగుమ్మ పంచాయతీ సంగడ, దబ్బగూడ గ్రామాల్లో సాగవుతున్న నాలుగు ఎకరాల గంజాయి తోటలను గుర్తించి ధ్వంసం చేశారు.

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం



జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి సాగును గుర్తించేందుకు డ్రోన్లతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుని శాటిలైట్ ద్వారా సాగు ఫొటోలు సేకరించి, గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 50 ఎకరాల్లో గంజాయి సాగును డ్రోన్ల సాయం, రెవెన్యూ, అటవీ, వ్యయసాయ శాఖల సహకరంతో గుర్తించి, ధ్వంసం చేశాం.

– అమిత్ బర్దర్, ఎస్పీ, పాడేరు.

బాలుడి హత్య

గొడ్డలితో నరికిన మానసిక రోగి



బాలుడి మృతదేహం

ఎటపాక: నాలుగేళ్ల బాలుడు దారుణ హత్యకు గురైన ఘటన ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ మద్దిగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన ముర్రం కోటేశ్వరరావు అనే వ్యక్తి కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని నెలల కిందట అతనిని విడిచి పెట్టి భార్య వెళ్లిపోయింది. అప్పటి నుంచి విపరీతంగా ప్రవరిస్తున్నాడు. గ్రామంలోని కణితి వెంకటేష్, రమ్య దంపతుల నాలుగేళ్ల కుమారుడు నాగరాజు సోమవారం పోలానికి వెళ్లాడు. మరో బాలికతో కలిసి మట్టి కోసం వెళ్లాడని తెలిసింది. ఆ సమయంలో కోటేశ్వరరావు గొడ్డలితో బాలుడిపై దాడి చేసి నరికాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజు సంఘటన స్థలంలోనే మరణించాడు. వెంటనే కోటేశ్వరరావు అక్కడ నుంచి పరారైనట్టు తెలిసింది. గ్రామం అటవీ ప్రాంతంలో ఉండటంతో ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు



ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షిస్తున్న డీఏవో నందు

కొయ్యూరు: జిల్లాలో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.బి.ఎస్. నందు తెలిపారు. ఏవో ఉమాదేవితో కలిసి సింగవరం కొనుగోలు కేంద్రంలో ధాన్యంలో తేమ శాతాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటి ద్వారా ఇప్పటి వరకు 14 వేల మెట్రిక్ టన్నులు సేకరించామని చెప్పారు. ధాన్యం విక్రయించిన తరువాత కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. పాడేరు డివిజన్‌లో 25 రాగుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.క్వింటా(100 కిలోలు) రూ.4,290 చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు.500 టన్నుల రాగులను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రతిపాదన

కొయ్యూరులో జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామని చెప్పారు. జిల్లాలో సేంద్రియ సాగును ప్రోత్సహించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఆర్‌జీఎల్‌కు బదులుగా ఎంటీయూ 1318రకం వరిని సాగుచేయాలని రైతులకు సూచిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థినిపై అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్టు

- పోక్సో కేసు నమోదు
- పాడేరు డీఎస్పీ ప్రమోద్



సాక్షి, పాడేరు: మండల కేంద్రం జి.మాడుగులలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల గిరిజన విద్యార్థినిపై జరిగిన అత్యాచార సంఘటనకు సంబంధించి ఒక మైనర్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు పాడేరు డీఎస్పీ కె.ప్రమోద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బాలికపై కొర్రా మల్లేశ్వరరావు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడని, ఇందుకు సహకరించిన కొర్రా నితిన్, ఓ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.గ్యాంగ్ రేప్ జరిగినట్టు వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. ఈనెల 25న ఈ గిరిజన బాలికను తల్లిదండ్రులు పాఠశాల నుంచి బయటకు తీసుకువచ్చి సామగ్రిని కొనిచ్చి, మళ్లీ పాఠశాలలో అప్పగించారని పేర్కొన్నారు. అయితే అదేరోజు సాయంత్రం 6.30 గంటల సమయంలో నిందితులు కొర్రా మల్లేశ్వరరావు, నితిన్‌లు బాలికను పాడేరుకు తీసుకువెళ్లారని తెలిపారు. మల్లేశ్వరరావు పాడేరులోని తన చెల్లి ఇంటికి బాలికను తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని, నితిన్ అనే వ్యక్తి ఆమె బయటకు పారిపోకుండా తలుపు గెడ పెట్టాడని, మరో బాలుడికి కూడా ఈ కేసుతో సంబంధం ఉండడంతో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

గ్యాంగ్ రేప్ అవాస్తవం : కలెక్టర్

జి.మాడుగుల మండలం గాంధీనగరం బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగిందని వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈనెల 25న ఆ విద్యార్థినికి దుస్తులు, ఇతర సామగ్రి కొనేందుకు ఆమె తండ్రి పాఠశాల నుంచి బయటకు తీసుకువచ్చాడని, సాయంత్రం పాఠశాలలో దింపిన తరువాత, మళ్లీ ఆమె బయటకు వచ్చినట్టు సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించామన్నారు. నిందితుడైన కొర్రా మల్లేశ్వరరావు అనే వ్యక్తితో విద్యార్థినికి ప్రేమ వ్యవహారం ఉన్నట్టు తల్లిదండ్రులకు తెలుసన్నారు. ఈనెల 25న బయటకు వెళ్లిన విద్యార్థిని 27వతేదీన గడుతూరులోని బంధువుల ఇంట్లో ఉన్నట్టు గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆమెను జి.మాడుగుల పోలీసుస్టేషన్‌కు అప్పగించినట్టు చెప్పారు. అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి సహకరించిన మరో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేశారని,అలాగే ఈ ఘటనపై శాఖాపరమైన విచారణకు గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీకి తగిన ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ తెలిపారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు

- ఈ ఏడాది 23,366 కిలోల ఎండు గంజాయి పట్టివేత
- 91.2కిలోల హాషిష్ ఆయిల్ స్వాధీనం
- 60.45 ఎకరాల్లో తోటల ధ్వంసం
- మావోయిస్టు కార్యకలపాల నియంత్రణ
- జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి
- ఎస్పీ అమిత్‌బర్దర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు గంజాయి సాగు,రవాణా నిర్మూలనకు తమ పోలీసుశాఖ వ్యూహాత్మంగా పటిష్ట చర్యలు తీసుకుందని ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. 2024లో జరిగిన నేరాలు, పోలీస్‌శాఖ చేపట్టిన నియంత్రణ చర్యలను సోమవారం విలేకరులకు సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలో పోలీసు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 30 పోలీసు స్టేషన్లు ఉన్నాయని,జిల్లా ఎక్స్‌ట్రిమిస్ట్ సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా జిల్లాలో గంజాయి నిర్మూలన కార్యక్రమాలను విస్తృతం చేసినట్టు చెప్పారు. ప్రత్యేక బృందాల ఏర్పాటుతో పాటు వ్యూహాత్మక ప్రదేశాలలో తనిఖీ కేంద్రాలు,ఇంటిలిజెన్స్ నెట్‌వర్క్‌తో మంచి ఫలితాలు సాధించినట్టు చెప్పారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 316 గంజాయి కేసులు నమోదు చేశామని, 23,366 కిలోల ఎండు గంజాయి,91.2కిలోల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 60.45 ఎకరాల గంజాయి తోటలను గుర్తించి 20,934 మొక్కలను ధ్వంసం చేశామని ఆయన తెలిపారు.గంజాయి కేసులకు సంబంధించి మొత్తం 936 మందిని అరెస్టు చేశామన్నారు.ఈ ఏడాది మావోయిస్టుల కార్యక్రమాలను పూర్తిగా అడ్డుకున్నామని చెప్పారు. మావోయిస్టు నేత సోడే బమన్,అలియాస్ దేవల్(ఏసీఎం క్యాడర్)తో పాటు ఏడుగురు మిలీషియా సభ్యులను అరెస్టు చేశామన్నారు.33మంది మిలీషియా సభ్యులను బాండ్ చేశామని చెప్పారు.మరో 14 మంది యాజీ క్యాడర్ మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు.పలు ప్రాంతాలలో మావోయిస్టు పార్టీకి చెందిన డంప్‌లు,పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మావోయిస్టు కార్యకలపాల నిర్మూలనకు సహకరించిన సరిహద్దులోని ఒడిశా,ఛత్తీస్‌గఢ్,తెలంగాణా రాష్ట్రాల్లోని పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా పోలీసుశాఖ అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని చెప్పారు.గిరిజన యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసుశాఖ సహకరించిందన్నారు. గంజాయికి ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటల సాగు,ఆర్థికాభివృద్ధికి పోలీసుశాఖ అన్ని విధాల చేయూతనిచ్చిందన్నారు. విత్తనాలు,ట్రాక్టర్లు పంపిణీ వంటి ఆర్థిక మద్దతును పోలీసుశాఖ గిరిజనులకు అందించడం సంతోషంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎస్పీ ఎస్.కె.ఆహ్మద్,పాడేరు డీఎస్పీ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

- జిల్లా ఖజానాధికారి ప్రసాదబాబు



పాడేరురూరల్: రిటైర్డ్ ఉద్యోగులు జనవరి1 నుంచి ఫిబ్రవరి 28 లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని జిల్లా ఖజానాధికారి ప్రసాదబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇందుకోసం అరకులోయ, చింతపల్లి, పాడేరు, అడ్డతీగల, రంపచోడవరం, చింతూరు ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఖజానా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నహెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

12వేల మంది విద్యార్థులతో సూర్య నమస్కారాలు

- ఇండియన్, ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థల నిర్వహణ
- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థల సంయుక్త సహకారంతో ఫిబ్రవరి 8వ తేదీన 12వేల మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాల ప్రక్రియ చేపడుతుండడం సంతోషంగా ఉందన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో ప్రణవ్ సంకల్ప యోగ సమితి అధ్యక్షుడు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు విజయవంతంగా జరుగుతున్నట్టు చెప్పారు. పాడేరు,జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లోని ప్రాథమిక యోగా శిక్షణ పూర్తి చేసుకున్న 12వేలమంది గిరిజన విద్యార్థినీవిద్యార్థులతో ఈ సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.యోగాను నిత్య సాధనగా ప్రతి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోనూ కొనసాగించాలని,దశలవారీగా అన్ని మండలాల్లో విస్తరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజనీ,యోగా గురువు పతంజలి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ముంచంగిపుట్టు: జిల్లాలో జి.మాడుగుల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గిరిజన మహిళా సంఘం(ఐద్వా) సభ్యులు డిమాండ్ చేశారు. కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టులో సోమవారం మహిళలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గిరిజన మహిళా సంఘం మండల అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి మాట్లాడుతూ అత్యాచారం చేసిన కొర్రా మల్లేశ్వరరావుతో పాటు వంతాల సన్యాసిరావు,మరో బాలుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళలు మణి,శాంతమ్మ,గౌరమ్మ,సత్యవతి, దేవి తదితరులు పాల్గొన్నారు.



మినుములపుట్టులో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి..

పాడేరు రూరల్: విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు, సోమవారం జిల్లా ఆస్పత్రిలో విద్యార్థిని, కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్‌ఎం,వార్డెన్‌లతో పాటు ఉపాధ్యాయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు లతకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు


ఐటీడీఏ పీవో సింహాచలంకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీవో సురేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం రంపచోడవరంలో జరిగిన గ్రీవెన్స్‌లో రాజవొమ్మంగి గ్రామస్తులు గణేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి సంఘటపై దర్యాప్తు చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ఫిర్యాదుదారులు గణేష్‌కుమార్ తదితరులు విలేకరులకు తెలిపారు.

మర్రి కామయ్య ఆశయ సాధనకు కృషి

హుకుంపేట: స్వాతంత్ర్య ఉద్యమ పోరాట యోధుడు మర్రి కామయ్య చరిత్రను భవిష్యత్ తరలకు తెలిసేలా ప్రయత్నిస్తామని, మర్రి కామయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం గిరిజన విద్యా అధ్యయన విభాగ విద్యార్థులు స్వాతి విజయ్‌కుమార్, ఆనందరావు చెప్పారు. సోమవారం మర్రి కామయ్య స్మారక ప్రదేశాన్ని వారు సోమవారం సందర్శించి, విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఉన్న మర్రి కామయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులను కలిసి మర్రి కామయ్య జీవిత చరిత్ర విశేషాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ వి.కట్టమణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దివ్య సూచనల మేరకు మర్రి కామయ్య జీవితంపై ప్రత్యేక డాక్యుమెంటరీ చేస్తున్నట్టు తెలిపారు. ఆదివాసీ స్వాతంత్ర్య పోరాట యోధుడు మర్రి కామయ్య జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించటానికి ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు, గ్రామ పెద్దలు పాంగి అప్పారావు, భాను ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. రంప ఆస్పత్రి

- సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యంతో రోగులకు ఇబ్బందులు
- సకాలంలో వైద్యం అందక గర్భిణి మృతి
- ఆస్పత్రిలో చేరి పది రోజులైనా ప్రాణాలు దక్కని వైనం
- జెడ్పీసమావేశంలో ఆస్పత్రి తీరుపై విమర్శలు


రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు రోజు రోజుకు తీసుకట్టుగా మారాయి. సిబ్బంది నిర్లక్ష్యం...వైద్యులు అందుబాటులో లేక పోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. 15 మంది వైద్యులు, 30 మంది వరకూ సిబ్బంది ఉన్నా సరైన వైద్యసేవలందడంలేదని రోగులు తెలిపారు. పర్యవేక్షణలోపం తదితర కారణాలతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఇటీవల జరిగిన కాకినాడ జెడ్పీ సమావేశంలో ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధులు చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పురాలేదు. దీంతో ఓ నిండు గర్భిణి ప్రాణాలు కోల్పోయింది. మారేడుమిల్లి మండలం రామన్నవలస గ్రామానికి చెందిన తెల్లం లక్ష్మి(32) సకాలంలో వైద్య సేవలు అందక సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. తెల్లం లక్ష్మి ఈ నెల 19వ తేదీన రంపచోడవరంలోని బర్త్ వెయింటింగ్ హాల్‌లో చేరింది. అక్కడ వైద్య పరీక్షలు అనంతరం ఈ నెల 23వ తేదీన ప్రసవ తేదీ ఇచ్చారు. కానీ ప్రసవం కాలేదు. ఆదివారం రాత్రి నొప్పులు ఎక్కువ కావడంతో బర్త్‌వెయింటింగ్ హాలు నుంచి ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ ఉన్న వైద్య సిబ్బంది గర్భిణి పరిస్థితి గురించి డ్యూటీ డాక్టర్‌కి సమాచారం ఇవ్వలేదు. గైనికాలాజిస్టులు కూడా ఆస్పత్రిలో అందుబాటులో లేరు. పరిస్థితి విషమించే సమయంలో 3.15 నిమిషాలకు డ్యూటీ డాక్టర్‌కు సమాచారం ఇచ్చారు. ప్రసవం చేసేందుకు ప్రయత్నించే లోపే గర్భిణి మృతి చెందింది.

సిబ్బందిపై చర్యలకు ఆదేశం

సమాచారం తెలుసుకున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషరెడ్డి, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. నొప్పులు ప్రారంభమైనప్పుడే డ్యూటీ డాక్టర్‌కు సమాచారమివ్వాలి కదా అంటూ వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ఇప్పుడు పోయిన ప్రాణానికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ నిలదీశారు. కనీసం ఆస్పత్రిలో ఏం జరుగతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత డ్యూటీ డాక్టర్ లేదా అని ప్రశ్నించారు. రౌండ్స్ తిరగాలి కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణి మృతిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. సబ్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించినట్టు పీవో తెలిపారు. గైనకాలాజిస్టులకు, వైద్య సిబ్బంది షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రతి రోజు ఒక గైనకాలాజిస్టు అయిన అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

వైద్య సిబ్బంది బెదిరించారు

మృతురాలి భర్త వెంకన్నదొర మాట్లాడుతూ తన భార్య చనిపోయిన తరువాత మృతదేహాన్ని వెంటనే తీసుకు వెళ్లిపోవాలంటూ వైద్య సిబ్బంది బెదిరించారని పీవోకు ఫిర్యాదు చేశారు. బర్త్ వెయింటింగ్ హాలుకు పది రోజులు ముందుగా వచ్చినా తన భార్య ప్రాణాలు కాపాడలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గైనికాలాజిస్టులు అందుబాటులో ఉంటే కనీసం తన భార్య ప్రాణాలు దక్కేవన్నారు.

సకాలంలో వైద్య అందకపోవడం వల్లే..

వైద్య సేవలు అందక గర్భిణి మృతి చెందడం చాలా బాధాకరం. ప్రసవం కోసం బర్త్ వెయింటింగ్ హాల్‌లో చేరి పది రోజులవుతున్న సరైన సమయానికి వైద్యం అందక తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోడం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం.ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ సంఘటనపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం. జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలని కోరినప్పుడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కానీ పరిస్థితిలో మార్పు లేదు. వైద్య సేవలు మెరుగు పరచడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఇటువంటి సంఘటనలు ఎప్పుడు జరగలేదు.

– పండా వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ, రంపచోడవరం

ప్రసవం కోసం వస్తే .. ప్రాణాలే తీసేశారు

తెల్లం లక్ష్మి సుఖ ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చి బర్త్ వెయిటింగ్ హాల్‌లో చేరితే వైద్య సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు తీసేశారు. 23వ తేదీన ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తామని చెప్పి నిర్లక్ష్యం చేశారు. రెండోసారి 26 అన్నారు. మూడో సారి 28 అన్నారు. వాళ్లని నమ్మిన లక్ష్మికి సకాలంలో వైద్య సేవలు అందించలేదు.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

– మట్ల వాణిశ్రీ, సిపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్, రంపచోడవరం

అనాథలం.. ఆదుకోండి

- 2018లో తల్లి మృతి... ఇటీవల తండ్రి మరణం
- పేదరికంతో వెంటాడుతున్న కష్టాలు
- రోడ్డున పడ్డ చిన్నారుల జీవితాలు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


అనాథ పిల్లలతో స్థానికులు

కొయ్యూరు: ఆ ముగ్గురు తల్లిదండ్రిలేని అనాథ బిడ్డలయ్యారు. వయస్సు పైబడిన నానమ్మ వారిని చూడడం సాధ్యం కావడం లేదు. దీంతో ఆ చిన్నారుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మంప పంచాయతీ తుమ్మలబందకు చెందిన ఎస్.మల్లేష్, రాధమ్మ దంపతులకు ముగ్గురు బిడ్డలున్నారు. తల్లి రాధమ్మ అనారోగ్యంతో 2018లో మరణించింది. నాటి నుంచి తండ్రి మల్లేష్ ఆధ్వర్యంలో వారు ముగ్గురు జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ పేద కుటుంబంపై కాలం కన్నెర్ర చేసింది. ఈ నేపథ్యంలో ఆ చిన్నారుల తండ్రి ఈనెల 12న మృతి చెందారు. దీంతో చిన్నారులు శివగంగ (14), దేవి దుర్గ (12), విష్ణు(10) తల్లిదండ్రులను కోల్పోయి అనాథులుగా మిగిలారు. వారి నాన్నమ్మ అక్కమ్మ చెంతను ఉంటున్నాయి. వృద్ధురాలు అయిన ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారి జీవనాధారం ప్రశ్నార్థకమైంది. కటిక పేదరికంతో అల్లాతున్న చిన్నారులు తమ బతుకుదెరువు కోసం ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన అనాథ చిన్నారులను ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంప మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ అనాథులైన చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వాళ్ల నాన్నమ్మ ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో చిన్నారుల జీవనం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనాథ చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

స్వల్పంగా పెరిగిన ఓటర్లు

మహారాణిపేట(విశాఖ) : ఉత్తరాంధ్ర టీచర్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. గత ఎమ్మెల్సీఎన్నికల్లో 19,523 మంది ఓటర్లు ఉండగా..స్వల్పంగా పెరిగారు. గత నెల 23న ప్రకటించిన జాబితాలో మొత్తం 15,287 మంది ఓటర్లలో పురుషులు 9,638 మంది, స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ ద్వారా 1,930 దరఖాస్తులు, ఆఫ్‌లైన్ ద్వారా 4,064 దరఖాస్తులు స్వీకరించారు. అదనంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘు వర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతోంది. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నాటికి ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు.

ప్రస్తుత ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	3,275	1,554	4,829
విజయనగరం	3,100	1,837	4,937
మన్యం పార్వతీపురం	1,532	730	2,262
అల్లూరి సీతారామరాజు	891	557	1,448
విశాఖపట్నం	2,403	2,874	5.277
అనకాపల్లి	1,747	1,055	2,802
మొత్తం	12,948	8,607	21,555

ముసాయిదా జాబితా ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
శ్రీకాకుళం	2,725	1,181	00	3,906
విజయనగరం	2,164	1,261	00	3,425
మన్యం పార్వతీపురం	1,267	595	00	1,862
అల్లూరి సీతారామరాజు	831	527	00	1,358
విశాఖపట్నం	1,426	1,421	00	2,847
అనకాపల్లి	1,225	664	00	1,889
మొత్తం	9,638	5,649	00	15,287

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ) : మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు, తీర్థయాత్రికుల కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- తిరుపతి–బనారస్(07107) స్పెషల్ రైలు జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22వ తేదీల్లో (శనివారం) రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటి రోజు (ఆదివారం) ఉదయం 10.58 గంటలకు దువ్వాడకు, సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విజయవాడ(07108) స్పెషల్ రైలు జనవరి 20, ఫిబ్రవరి 10, 17, 24వ తేదీల్లో (సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి మంగళవారం రాత్రి 11.23 గంటలకు దువ్వాడకు, బుధవారం తెల్లవారు 5.30 గంటలకు విజయవాడ చేరుకుంటాయి.
- నరసాపూర్–బనారస్(07109) స్పెషల్ రైలు జనవరి 26, ఫిబ్రవరి 2వ తేదీల్లో (ఆదివారం) ఉదయం 6 గంటలకు నరసాపూర్‌లో బయల్దేరి అదేరోజు ఉదయం 10.58 గంటలకు, సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–నరసాపూర్(07110) స్పెషల్ రైలు జనవరి 27 ఫిబ్రవరి 3వ తేదీల్లో (సోమవారం) సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి, మరుసటిరోజు (మంగళవారం) రాత్రి 11.23 గంటలకు దువ్వాడకు, బుధవారం తెల్లవారు 5 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది.

పలు రైళ్ల నెంబర్లు మార్పు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఇప్పటివరకు మెము స్పెషల్, పాసింజర్ స్పెషల్స్‌గా నడిచిన పలు రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి కొత్త రైలు నెంబర్లతో రెగ్యులర్ పాసింజర్ రైళ్లుగా ప్రయాణించనున్నాయి.

రైలు పేరు	పాత నంబరు	కొత్త నంబరు
కటక్–గుణుపూర్ పాసింజర్	08421	68433
గుణుపూర్–కటక్ పాసింజర్	08422	68434
విశాఖపట్నం –కిరండూల్ పాసింజర్	08551	58501
కిరండూల్–విశాఖపట్నం పాసింజర్	08552	58502
విశాఖపట్నం–రాయ్‌పూర్ పాసింజర్	08528	58528
రాయ్‌పూర్–విశాఖపట్నం పాసింజర్	08527	58527
విశాఖపట్నం–కోరాపుట్ పాసింజర్	08546	58538
కోరాపుట్–విశాఖపట్నం పాసింజర్	08545	58537
విశాఖపట్నం–బ్రహ్మపూర్ పాసింజర్	08531	58532
బ్రహ్మపూర్–విశాఖపట్నం పాసింజర్	08532	58531
విశాఖపట్నం–గుణుపూర్ పాసింజర్	08522	58506
గుణుపూర్–విశాఖపట్నం పాసింజర్	08521	58505
విశాఖపట్నం–భవానిపట్న పాసింజర్	08504	58504
భవానిపట్నం–విశాఖపట్నం పాసింజర్	08503	58503

దక్షిణ జోన్ కుస్తీ పోటీల్లో గిరి విద్యార్థుల సత్తా

రెండు రజత, రెండు కాంస్య పతకాల సాధన



పతకాలు సాధించిన విద్యార్థులు, విద్యార్థులను అభినందిస్తున్న సాలెం కోచ్

కొయ్యూరు: తమిళనాడులోని సాలెం జిల్లాలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగిన దక్షిణ జోన్ కుస్తీ పోటీల్లో గిరిజన క్రీడాకారులు సత్తా చాటారు. కొయ్యూరు కుస్తీ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు రెండు రజత, రెండు కాంస్య పతకాలను సాధించారు. అండర్ 15 విభాగం (48 కిలోలు)లో జి. దుర్గాప్రసాద్ రజతం, 44 కిలోల విభాగంలో వంతల శ్రీను కాంస్య పతకాన్ని సాధించారు. బాలికల విభాగం(45 కిలోలు)లో కె.తబిత.. రజిత పతకం, సీనియర్ విభాగం (60 కిలోలు)లో సీహెచ్. మహేశ్ గ్రీక్ రోమన్ స్టైల్‌లో కాంస్య పతకం సాధించారు.పతకాలు సాధించిన నలుగురిని అధికారులు అభినందించారు.దక్షిణ జోన్ పోటీల్లో ఇక్కడ కుస్తీ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని కోచ్ అంబటి నూకరాజు తెలిపారు.

లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు


ఆశ్రమ పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: విద్యార్థినులపై లైంగికదాడులకు పాల్పడితే పోక్సో వంటి కఠిన చట్టాలు అమలుచేసి, చర్యలు తీసుకుంటామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. మండలంలో గాంధీ నగరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సోమవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25న విద్యార్థిని తప్పిపోయినట్టు సమాచారం వచ్చిందన్నారు. అదే రోజు సాయంత్రం విద్యార్థిని పాఠశాలకు వచ్చిన తరువాత గడుతూరు గ్రామానికి అత్త వద్దకు వెళ్తానని చెప్పి వెళ్లిందన్నారు. విద్యార్థిని కోసం రెండు రోజులు వెతికి గడుతూరు నుంచి విద్యార్థినిను ఉపాధ్యాయులు తీసుకువచ్చారని తరువాత విద్యార్థిని లైంగిక వేధింపులకు గురైనట్టు తెలిసి తక్షణమే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుతో వారిపై పోక్సో కేసు నమోదైనట్టు పీవో తెలిపారు. ఇక్కడ జరిగిన సంఘటనలో ముగ్గురుపై పోక్సో చట్టం నమోదు చేశామన్నారు. లైంగిక సంఘటనలకు పాల్పడితే పోక్సో కేసులో 20సంవత్సరాల పాటు శిక్ష కఠినంగా ఉంటుందన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇకపై తల్లిదండ్రుల అనుమతితోనే బయటకు పంపడం జరుగుతుందని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు. డీడీ రజనీ, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐఐఎంవీ ఆహ్వానం

తగరపువలస(విశాఖ): ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంవీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా మూడు విభిన్నమైన కార్యక్రమాల ద్వారా శిక్షణకు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, బలహీన వర్గాలను ఆహ్వానిస్తోంది. శిక్షణా కాలంలో వీరికి ఐఐఎంవీలో వసతి, భోజనం సమకూర్చనున్నారు. ప్రయాణ ఖర్చులు అభ్యర్థులే భరించుకోవాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జనవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తారు. వివరాలకు ఐఐఎంవీకి సంబంధించిన IIMV FIELD వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఇతర వివరాలకు incubationcenter@iimv.ac.in లేదా 917569 309208 వాట్సప్ నంబరు ద్వారా సంప్రదించవచ్చు. వీటిలో ఎండీపీ ఫౌండర్స్ లాంచ్‌పాడ్ గ్రోత్ అండ్ యాక్సలరేషన్ స్ట్రాటజీస్‌లో ఆరు రోజుల శిక్షణను జనవరి 17 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. ఇందులో 25 మందికి అవకాశం ఉంది. నిర్వహణ, ఫైనాన్స్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఎండీపీ పాలసీ లీడర్‌షిప్ 2025 శిక్షణ ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు ఉంటుంది. ఈ శిక్షణలో ఎంపికైన 25 మందికి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అనలిటిక్స్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ వంటి లక్ష్యాలను వివరిస్తారు. ఏఈఎస్‌డీపీనేవిగేటింగ్ జర్నీ విజన్ టు వెంచర్ బిల్డింగ్ శిక్షణలో 20 మందికి మార్చి 3 నుంచి 7 వరకు శిక్షణ ఉంటుంది. వ్యాపార మోడలింగ్ సాధనాలు, వ్యవస్థాపక ఫ్రేమ్‌వర్క్‌లపై శిక్షణ ఇవ్వనున్నారు.

కమ్ముకున్న మంచు


ముంచంగిపుట్టులోని మంచులో హెడ్‌లైట్ వెలుతురులో వాహనం


కామయ్యపేటలో పొగమంచు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. గత సోమవారం గిరిజన గ్రామాలపై మంచు దుప్పటి కప్పబడి ఉంది. మంచు దట్టంగా కురుస్తుండడంతో పనులకు కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, చిన్నారులు బయటకు వెళ్లేందుకు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి చలి మొదలు ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత అధికంగా ఉంటుంది. చలి నుండి ఉపశమం పొందేందుకు గ్రామాల్లో చలి మంటలు వేసుకుంటున్నారు. వాహనాదరులు హెడ్‌లైట్ వేసుకొని మంచులో రాకపోకలు సాగిస్తున్నారు.

హుకుంపేట: మండలంలోని చలి తీవ్రత పెరగడంతో గిరిజనులు గజగజ వణుకుతున్నారు. ఉదయం 11గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. చలి మంటలనే ఆశ్రయిస్తున్నారు. రహదారులో పొగ మంచు అధికంగా ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ముగిసిన మార్గశిర మాసోత్సవాలు


పుష్పాలతో అమ్మవారి దివ్యరూపం

డాబాగార్డెన్స్(విశాఖ): నెల రో జులుగా జరుగుతున్న బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసో త్సవా లు సోమవారం ముగిశాయి. చివరి రోజున అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరా రు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు జరిపారు.


సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారి మాలధారణ చేసిన భక్తుల కోసం మహాపూర్ణాహుతి నిర్వహించారు. మాలధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకుని, దీక్షను విరమించారు. మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా సహస్రదీపాలంరణ సోమవారం సాయంత్రం నిర్వహించారు. బురుజుపేట బృందం కళానైపుణ్యంతో దీపాలంకరణ చేపట్టారు.

పకడ్బందీగా శారీరక దారుఢ్య పరీక్షలు

ఆరిలోవ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో కానిస్టేబుళ్ల అభ్యర్థులకు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు.

ప్రాథమిక రాత పరీక్షలో మొత్తం 11,568 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మొదటి రోజు 600 మందికి గానూ 233 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల నడుమ పారదర్శకంగా పరుగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల నిర్వహణలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ టి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ప్రధాని రాక


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. వర్సిటీ 2025 సంవత్సర క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఇతర ఆచార్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏయూలో ప్రత్యేకంగా సెంటినరీ టవర్, సెంటినరీ పార్కులను నిర్మించనున్నట్లు తెలిపారు. 2026 జనవరి 26న సెంటినరీ వేడుకల ప్రధాన కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 2025 ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమయ్యే శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని విభిన్న సదస్సులు, వర్క్ షాప్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆచార్య దనంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు. క్యాలెండర్లను పంపిణీ చేశారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు బంద్

సింహాచలం(విశాఖ): సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి వచ్చే నెల 9 వరకు అధ్యయనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి(అయ్యవారిసేవ) ఉంటుందని తెలిపారు. జనవరి 10వ తేదీ నుంచి 20 వరకు రాపత్తు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. రాపత్తు ఉత్సవాల్లో ప్రతీరోజూ సాయంత్రం స్వామికి సింహగిరి మాడ వీధుల్లో రోజుకొక అలంకారంలో తిరువీధి ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వచ్చేనెల 17వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. రాపత్తు ఉత్సవాల రోజుల్లో రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయి తెలిపారు.